ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

- యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో మంగినపూడి బీచ్ ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

- బలహీన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి s.సవిత పేర్కొన్నారు.

- ఐపీఎల్ లో భాగంగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా.. పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

====================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈరోజు రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని 'శ్రీ రతన్ టాటా హబ్'లో రాజమహేంద్రవరం టూరిజం హబ్, ఏపీటీడీసీ కాకినాడ డివిజన్ అభివృద్ధిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తిలకించిన మంత్రి, పర్యాటక రంగ అభివృద్ధికి సంబంధించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాబోయే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం వసతి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. 21 ప్రధాన దేవాలయాల్లో 'టెంట్ సిటీలు' ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పారు. భక్తులు దర్శనం తర్వాత తిరుగు ప్రయాణం కాకుండా అక్కడే బస చేసి సమీప ప్రాంతాలను చూసేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల రాక లక్ష్యంగా 'గోదావరి టూరిజం సర్క్యూట్' ను ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఇటీవల వైజాగ్-అరకు మధ్య ప్రారంభించిన కార్వాన్ టూరిజంకు విశేష స్పందన వస్తోందని, అదే తరహాలో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోనూ, రాష్ట్రవ్యాప్తంగా కార్వాన్, అడ్వెంచర్, హెలీ టూరిజం ప్రాజెక్టులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. కాకినాడ, ఉప్పాడ, పేరుపాలెం బీచ్‌లను 'బ్లూ ఫ్లాగ్' సర్టిఫికేషన్ దిశగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. కేరళ కంటే అద్భుతమైన ప్రకృతి సౌందర్యం ఏపీలో ఉందని, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ఆంధ్రప్రదేశ్ పర్యాటక వైభవాన్ని చాటిచెప్పేలా విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు.

====================

రాష్ట్రంలోనే ఉత్తమ బీచ్ గా మంగినపూడి బీచ్ ను తీర్చిదిద్దుతామని గనులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగినపూడి బీచ్ నందు జిల్లా అధికారులతో కలిసి మంత్రి సామూహిక టాయిలెట్ల నిర్మాణం, యాత్రికులకు అవసరమైన మౌలిక సదుపాయాల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామంలో చదువుకున్న యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంగా మంగినపూడి బీచ్ ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ పర్యాటక నిధులతో అభివృద్ధి పనులు నిర్వహించడానికి అవసరమైన డిపిఆర్ ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక అభివృద్ధికి అనుకూలమైన బీచ్ లలో మంగినపూడి బీచ్ ఒకటని పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన బీచ్ ఫెస్టివల్ ను తిరిగి నిర్వహిస్తామని, ఈ ఫెస్టివల్ ద్వారా ప్రపంచ పర్యాటకులను ఆకర్షించడమే

లక్ష్యమని తెలిపారు. బీచ్ వద్ద పెట్టుబడులు పెట్టేందుకు, సినిమా షూటింగ్ లు చేసుకునేందుకు పారిశ్రామికవేత్తలు, డైరెక్టర్లు ముందుకు వస్తున్నారని మంత్రి వివరిస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ లీసా గిల్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ లీసా గిల్‌కు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు సాయంత్రం లోక్ భవన్‌లో ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఆమె ప్రమాణం చేస్తారు. అంతకుముందు ముఖ్యమంత్రి లోక్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. స్వల్ప అస్వస్థత కారణంగా గవర్నర్ ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

====================

విరామం

====================

బలహీన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవిత పేర్కొన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో టీడీపీ బీసీ సాధికార సమితి కన్వీనర్లు, జోనల్ కో ఆర్డినేటర్లతో మంత్రి సవిత ఈరోజు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నామన్నారు. బీసీ రక్షణ చట్టానికి తుది రూపు ఇస్తున్నామని, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు డెడికేటెడ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రాధాన్యత కల్పించడానికే బీసీ సాధికార సమితులను ఏర్పాటు చేశామని మంత్రి సవిత తెలియజేస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

సింగపూర్ పర్యటనలో ఉన్న రాష్ట్ర మంత్రుల బృందం పట్టణ ప్రణాళిక, సుస్థిర అభివృద్ధిపై అధ్యయనం చేశారు. సింగపూర్ లో ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ మారో ఆర్కిటెక్ట్స్' ను సందర్శించిన మంత్రుల బృందం ఆర్కిటెక్ట్' ప్రతినిధులతో సమావేశమై, అత్యాధునిక నగర నిర్మాణ నమూనాలు, స్మార్ట్ సిటీలపై చర్చించారు. అలాగే AI, డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించి భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా "స్మార్ట్ సిటీ"ల కోసం రూపొందించిన ప్రణాళికలను మంత్రులు పరిశీలించారు. సింగపూర్ అనుసరిస్తున్న సినారియో ప్లానింగ్, అర్బన్ డిప్లొమసీ వంటి విధానాల గురించి రాష్ట్ర మంత్రుల బృందం అడిగి తెలుసుకుంది.

====================

భారత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాక్రిష్ణన్ ఈనెల 27,28 తేదీల్లో తిరుపతి, తిరుమలలో పర్యటించనున్నట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఈనెల 27వతేదీ రాత్రి 8 గంటల 30 నిముషాలకు తిరుపతి విమానాశ్రయానికి ఉపరాష్ట్రపతి చేరుకుంటారని.. తిరుమలలోని గాయత్రి అతిథిగృహంలో బసచేసి 28వతేదీ ఉదయం 8గంటలకు తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం తిరుచానూరుకు చేరుకుని ఉదయం 10 గంటల 30 నిముషాలకు పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో తిరుపతి విమానాశ్రయంలో భద్రతపై ఎస్పీ ఈరోజు సమీక్ష నిర్వహించారు. అలాగే ఆయన పర్యటించనున్న ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు.

====================

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గ్రామీణ, పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లా జామి మండలం మధుర సోమయాజులపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అంతకుముందు జామి మండలం అట్టాడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన

ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ ప్లాంట్‌తో అట్టాడతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలకు శుద్ధమైన మంచినీరు అందుబాటులోకి వస్తుందన్నారు.

=====================

ఐపీఎల్ లో భాగంగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా.. పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు బ్యాటింగ్ ప్రారంభించి, 20 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 264 పరుగులు చేసింది. 265 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన పంజాబ్ కింగ్స్ జట్టు 3 ఓవర్లు పూర్తయ్యేసరికి 63 పరుగులు చేసింది.
అలాగే... ఈరోజు రాత్రి 7 గంటల 30 నిముషాల నుండి జైపూర్ లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య మరో మ్యాచ్ జరగనుంది.

=====================
=====================